ప్రజాశక్తి
సోమవారం 5 ఆగస్టు 2024 5
శ్రీ సత్యసాయి



నేడు కలెక్టరేట్ ముట్టడి.. విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులకు నిరసనగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో స్కీం వర్కర్లపై రాజకీయ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. ఇందుకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సత్య సాయి జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్ కార్మికులు ,యానిమేటర్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముట్టడి నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్మికుడు పాల్గొనాలని కోరారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారిపై రాజకీయం ఎందుకని ప్రశ్నించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ప్రజా సంఘ నాయకులు, అంగన్వాడీ, ఆశ, మునిసిపల్ యూనియన్ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఈ - క్రాప్ ఏదీ..?



కరువు పరిస్థితుల్లో పంట నమోదు ప్రశ్నార్థకం
ఈ క్రాప్ లేకుండా నష్టపరిహారం అందేనా..?

కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ప్రతి పంటనూ ఈ క్రాప్ బుకింగ్ చేయాలి. అది కూడా పంట వేసిన పొలంలోకెళ్లి నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది ఉంటేనే భవిష్యత్‌లో పంటనష్టం సంభవిస్తే రైతులకు పరిహారం అందించడానికి వీలవుతుంది. అయితే ఖరీఫ్ ప్రారంభమై చాలాకాలమైనా ఇప్పటికీ ఈ క్రాప్ బుకింగుకు ఎటువంటి ప్రక్రియ మొదలవలేదు. ఇప్పటికే సగం పంటకాలం పూర్తయింది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు జిల్లాలో నెలకొని ఉన్నాయి. ఈ తరుణంలోనైనా ప్రభుత్వం ఈ క్రాప్ బుకింగ్‌పై చర్యలు తీసుకుంటుందా లేదా అన్న సందేహాలు నెలకొన్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

24 శాతం పంట

అనంతపురం జిల్లాలో సాధారణంగా 8.56 లక్షల ఎకరాల్లో పంటలు సాగవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 2.07 లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగయ్యాయి. జొన్న, మొక్కజొన్న,, పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలు పూత దశలోనున్నాయి. జూన్‌లో పడిన వర్షాలకు ఈ పంటలు సాగయ్యాయి. అయితే జులై నెల మొత్తం వర్షాభావ ప్రభావం పంటలపై పడింది. ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులే నెలకొని ఉన్నాయి. దీంతో వేసిన పంట ఏ మేరకు చేతికందుతుందో కూడా తెలియకుండా ఉంది. ఈ విషయంపై రైతుల్లో గుబులు నెలకొంది. ఈ సమయంలో ఈ క్రాప్ బుకింగు అయినా చేసి ఉంటే నష్టం వస్తే ఇన్‌పుట్ సబ్సిడీగాని, బీమాగాని వర్తించేందుకు వీలుంటుందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

వర్షాల్లేక నష్టమెచ్చే పరిస్థితి ఉంది

ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట వేశాను.జూన్ ఆఖరులోపడిన వర్షాలకు విత్తనం వేశాను. అయితే జులై నెలలో వర్షాలు పడకపోవడం దిగుబడులపై ప్రభావం చూపనుంది. ఈ నెలలోనూ వర్షాలు పడకపోతే పూర్తిగా నష్టపోయే పరిస్థితి వస్తుంది. గతేడాది వర్షాభావంతో నష్టపోయాం. ఈసారి అదే జరిగేలా ఉంది. ఈసారి ఇప్పటి వరకు ఈ క్రాప్ బుకింగుకు ఎవరూ రాలేదు. అది ఉంటేనే పరిహారం వస్తుందన్నట్టు చెబుతున్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేస్తే బాగుంటుంది.

సుబ్బిరెడ్డి,
లింగనపల్లి గ్రామం
రాప్తాడు మండలం

ఈ క్రాప్ బుకింగ్ చేయాలి



ఈసారి వర్షాభావంతో పంట సాగైందే చాలా తక్కువ. వేసిన పంట కూడా చేతికొచ్చే పరిస్థితి లేకుండా ఉంది. నష్టపోతున్న రైతులను గుర్తించడంలో కీలకం ఈ క్రాప్ బుకింగ్. ఈసారి ఇప్పటి వరకు ఈ క్రాప్ బుకింగ్ మొదలే కాలేదు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఈ క్రాప్ బుకింగ్ చేయాలి. అదే విధంగా నష్టపోతున్న రైతులను గుర్తించి నివేదికలు రూపొందించాలి.

చంద్రశేఖర్‌రెడ్డి,
జిల్లా ప్రధాన కార్యదర్శి,
ఏపి రైతు సంఘం

జిల్లాలో తహశీల్దార్ల నియామకం

క్రమసంఖ్య	పేరు	స్థలం
1	వెంకటనారాయణ	సూపరింటెండెంట్ ఎస్టాబ్లిమెంట్ అడ్మిన్ సెక్షన్, కలెక్టరేట్
2	ఎ. సురేష్ కుమార్	సూపరింటెండెంట్,కలెక్టరేట్
3	ఖతిజున్ ఖుప్రా	సూపరింటెండెంట్,కలెక్టరేట్
4	కె. నాగరాజు	సూపరింటెండెంట్,కలెక్టరేట్
5	అనుపమ	పుట్టపర్తి
6	జి నాగేంద్ర	రొద్దం
7	సయ్యద్ షహబుద్దీన్	బుక్కపట్నం.
8	కె. నాగరాజు	కొత్తచెరువు
9	వై. రంగనాయకులు	నల్లమాడ
10	అనంతచారి	ఓబుళదేవరచెరువు
11	పి. సుబ్బలక్ష్మమ్మ	రెవెన్యూ డివిజనల్ అధికారి. ధర్మవరం
12	జి. నటరాజ్	ధర్మవరం
13	ఆర్. జమానుల్లా ఖాన్	రామగిరి
14	ఎం. వేణుగోపాల్	గాండ్లపెంట
15	కె. శ్రీధర్	పెనుగొండ
16	ఆర్‌ఎస్. హసీనా సుల్తాన్	పరిగి
17	సౌజన్య లక్ష్మి	లేపాక్షి
18	టి. ఆనంద్ కుమార్	చిలమత్తూరు
19	ఎ. శ్రీనివాసులు	అగళి
20	బిఎస్. జిలాని	రొళ్ల
21	డి. స్వర్ణలత	అమరాపురం
22	కరుణాకర్	గుడిబండ
23	ఆర్ మురళీకృష్ణ	తహశీల్దార్ కేడర్

మాతాశిశు ఆసుపత్రిలో

వైద్య ఆరోగ్య సిబ్బంది పోస్టులు రద్దు..!

పనిభారంతో సెలవులకు సిద్ధమవుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రి ఆవరణంలో ఉన్న మాత శిశు అసుపత్రికి సంబందించి ఖాళీగా ఉన్న వైద్య ఆరోగ్య సిబ్బంది పోస్టులను ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఏర్పడింది. ఫలితంగా ఉన్న సిబ్బందిపై పనిభారం పడింది. దీంతో ఆ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది సెలవులపై వెళ్లడానికి సిద్ధపడ్డారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నా సమయంలో జాతీయ ఆరోగ్య మిషన్ వారు హిందూపురానికి మాత శిశు ప్రత్యేక విభాగాన్ని మంజూరు చేశారు. ఈ ప్రత్యేక విభాగాన్ని జిల్లా ప్రభుత్వ అసుపత్రి ఆవరణంలో రూ.20.15కోట్లతో నిర్మాణం చేపట్టారు. ఈ పనులు పూర్తి చేసి, 2017 జూన్ 23న అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా దానిని ప్రారంభించారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిబంధనల మేరకు మాతా శిశు విభాగానికి సంబంధించి పూర్తి స్థాయిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య మిషన్ ద్వారా నియమించాల్సి ఉంది. అయితే ఆ సమయంలో ఉన్న మెడికల్ సుపరిటెండెంట్ కనీస సమాచారం ఇవ్వకుండా అసుపత్రిని ప్రారంభించారు. దీంతో ఉన్న సిబ్బంది పని ఒత్తిడి పెరగడంతో తాము విధులు నిర్వహించలేమని అప్పట్లో ఆందోళన చేశారు. ఈ విషయాన్ని ఆ సమయంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ద్వారా కేంద్రానికి విన్నవించి జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా మాత శిశు విభాగానికి ఐదుగురు గైనకాలిజ్టులు, చిన్న పిల్లల వైద్యులు, అనిస్థీయా వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. 1 గైనకాలిస్టు, 1 అనిస్థీయాతో పాటు కొంత మంది నర్సింగ్ సిబ్బందిని నియమించారు. మాతా శిశు అసుపత్రికి సంబందించి వైద్య ఆరోగ్య సిబ్బందిని నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా డిఐసి, హెచ్‌డియూ, ఎన్‌సిడి తదితర ప్రోగ్రాముల ద్వారా కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఈ నేపథ్యంలో హిందూపురం మాతాశిశు ఆసుపత్రికి 37 మందిని నియమించారు. ఇందులో ఇప్పటికే 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమిస్తే 8 మంది గైనకాలిస్టులతో పాటు 4 అనిస్థీయా వైద్యులు, చిన్న పిల్లల వైద్యులతో పాటు అదనంగా 25 మంది వరకు నర్సింగ్ సిబ్బందితో పాటు ఇతర సిబ్బంది ఉండే వారు. కేవలం ఇద్దరు వైద్యులతో పాటు 12 మంది నర్సింగ్ సిబ్బందిని నియమించారు. వీరికి 70 శాతం కేంద్రం, 30శాతం రాష్ట్రం భరిస్తూ వేతనాలు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇచ్చే వేతనాలు సైతం సకాలంలో ఇవ్వకుండా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అయినప్పటికి ఉన్న సిబ్బంది సమన్వయం చేసుకుని రోజుకు సగటున 20 నుంచి 30 వరకు డెలివరీలు చేయడంతో పాటు చిన్నారులకు జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా అన్ని సౌకర్యాలతో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హెచ్‌డియూ కింద కేటాయించిన 10 పోస్టులను రద్దు చేసింది. ఉన్న పోస్టులను జాతీయ ఆరోగ్య మిషన్ వారు రద్దు చేసి, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నడుస్తున్న మరో అసుపత్రికి బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. రద్దు చేసిన పోస్టులను మినహాయిస్తే ఆసుపత్రిలో కేవలం 13 మంది మిగులుతారు. దీంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పడింది. ఈ నేపథ్యంలోో ఆ విభాగంలో పని చేసే సిబ్బంది సెలవుల్లో వెళ్లడానికి సిద్ధం అవుతున్నారు. పరిస్థితిని గమనించిన జిల్లా అసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్ జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నియమించిన వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పోస్టులను రద్దు చేయకుండా కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కోరుతు గత నెల లేఖ రాశారు. కనీసం ఇద్దరు అనిస్థీయా, ఒక జనరల్ వైద్యులతో పాటు 10 మంది స్టాఫ్ నర్సులను నియమించాలని కోరారు. నెలకు సగటున 200 నుంచి 300 వరకు గర్భిణులను సిజరేయన్ శస్త్ర చికిత్సలు చేస్తున్నామని, నాణ్యమైన వైద్య సేవలను అందించాలంటే సిబ్బందిని నియమించాలని కోరారు. అయితే ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఏలాంటి స్పందన రాలేదు. దీంతో ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరగడంతో వారు సెలవులో వెళ్లడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే బాలయ్య చొరవ చూపాలి

శ్రీ సత్య సాయి జిల్లాలోనే హిందూపురం అసుపత్రికి జిల్లా స్థాయి హోదా ఉంది. అయితే హోదాకు తగ్గట్లు సిబ్బంది లేరు. కనీసం జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా మంజూరు అయిన వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించే విధంగా స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపితే మాతా శిశు విభాగానికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిచడానికి సాధ్యం అవుతుంది. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో సమగ్రంగా చర్చించి సిబ్బందిని తీసుకోచ్చే విధంగా చర్యలు తీసుకుని, హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



హిందూపురం మాతాశిశు ఆసుపత్రి

పాత రోడ్డును కొనసాగించాలి

రాస్తారోకోలో వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

పాత రోడ్డును కొనసాగించి ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కోనాపురం, మంగాపురం, కొండాపురం గ్రామాలతో పాటు డిగ్రీ కాలేజీకి వెళ్లే విద్యార్థులు సౌకర్యార్థం పాత రోడ్డును కొనసాగిస్తూ ప్రమాదాలను అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో గ్రామపంచాయతీ రోడ్డుగా నమోదైందన్నారు. గ్రామపంచాయతీ నిధులు లక్షలాది రూపాయలు వెచ్చించి తారు రోడ్డు కూడా వేశారన్నారు. అయితే ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ నగర పంచాయతీకి సర్వహక్కులు ఉన్నాయని చెబుతూ ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా పాత రోడ్డును మార్పు చేస్తూ కొత్త రోడ్డుకు అనధికార అనుమతులు ఇచ్చారని విమర్శించారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు , ప్రతిపక్ష పార్టీల నాయకులకు లాభాలు తెచ్చి పెట్టేందుకు కమిషనర్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. పాత రోడ్డునే కొనసాగించాలని గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే శంకర నారాయణకు విజ్ఞప్తి చేస్తే అప్పట్లో నిలుపుదల చేశారని అన్నారు. మండల సర్వేయర్ పాత రోడ్డును గుర్తించి కొత్త రోడ్డు వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని చెప్పారన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు ఈ విషయంపై విజ్ఞప్తి చేసినా ఆయన ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. నగర పంచాయతీ అభివృద్ధి గురించి ఆలోచించనని మున్సిపల్ కమిషనర్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం రోడ్డును మార్చుతున్నారని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలను ప్రమాదాల నుండి కాపాడి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డివిజన్ కేంద్రంలో జరిగే ప్రజా వేదికను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, సిపిఎం స్థానిక నాయకులు ఉత్తప్ప, తిప్పన్న, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

విద్యుత్ శాఖ జిల్లా నోడల్ అధికారి మోసెస్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్



ప్రస్తుత ఆధునిక సమాజంలో విద్యుత్ లేనిదే ఏ పని చేయలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్‌ను పొదుపు గా వాడకుండా గ్రామాల్లో పగలు పూట కూడా విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు వెలుగుతుండటం మనం చూస్తూనే ఉంటాం. తరచు హై వోల్టేజీ లేదా లో వోల్టేజీతో విద్యుత్ సరఫరా అవుతూ ఉంటుంది. అప్పుడు పలు వినియోగదారుల ఇళ్లలో ఫ్రిడ్జ్ లు, టీవీలు, ఫ్యాన్లు చెడిపోవడం జరుగుతూ ఉంటుంది. దీంతో వినియోగదారులు నష్టపోతుంటారు. అవసరమైన మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అలాగే విద్యుత్ కొత్త కనెక్షన్ల కోసం రైతులు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల వినియోగదారులు ముఖ్యంగా రైతులు విద్యుత్ ప్రమాదానికి గురవుతుంటారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాతో పాటు జిల్లాలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై జిల్లా విద్యుత్ నోడల్ అధికారి మోసెస్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి? కొత్త కలెక్షన్లు ఎప్పటిలోగా మంజూరు చేస్తారు?

జవాబు : జిల్లావ్యాప్తంగా హిందూపురం, ధర్మవరం, కదిరి సబ్ డివిజన్లో 1. 43 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. కొత్త కలెక్షన్లకు డిపాజిట్ చెల్లించిన వారికి వరుస క్రమంలో కనెక్షన్లు ఇవ్వనున్నాము. దరఖాస్తు చేసుకున్న తరువాత ఒకటి రెండు నెలల్లో కనెక్షన్లు మంజూరు చేయడం జరుగుతుంది. అవసరమైన స్తంభాలు, వైర్లు, ఇతర పరికరాలు సమకూర్చుకోవడానికి కొంత సమయం పడుతుంది.

ప్ర : జిల్లాలో ఎన్ని సబ్ స్టేషన్లు ఉన్నాయి? కొత్తగా ఎన్ని ప్రతిపాదించారు?

జ : జిల్లా వ్యాప్తంగా 135 సబ్ స్టేషన్లు ఉన్నాయి. మరో 100 వరకు సబ్ స్టేషన్లు నిర్మాణాలకు ప్రభుత్వానికి నివేదికను అందించాం. ఈ నూతన సబ్ స్టేషన్లు ఏర్పడితే అందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పడతాయి. దీంతో లో వోల్టేజీ, హై వోల్టేజీ సమస్యలు ఉండవు. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే 24 గంటల్లో కొత్తవి ఏర్పాటు చేస్తున్నాము. ప్రభుత్వం కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి తగిన నిధులు కేటాయించిన వెంటనే నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

ప్ర : వ్యవసాయ రంగానికి ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు ?

జ : ఇప్పటివరకు రైతులకు వ్యవసాయ రంగానికి 7 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. నూతన ప్రభుత్వం రైతులకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్న ఆలోచనలో ఉంది. విద్యుత్ ఉత్పత్తిని బట్టి సరఫరా జరుగుతుంది. ఆ మేరకు విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం ఆమోదిస్తే 9 గంటలు విద్యుత్ ఇవ్వడం జరుగుతుంది.

ప్ర : సిబ్బంది కొరత ఉందా? మొండి బకాయిల పరిస్థితి ఏమిటి.?

జ : సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 20 మంది ఏఈలు మాత్రమే ఉన్నారు. మరో వంద మంది ఏఈలు అవసరం ఉంది. అందుకు ప్రభుత్వానికి నివేదికను పంపాం. కొత్త ఏఈలు వస్తే పని భారం తగ్గుతుంది. వినియోగదారులకు కూడా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంది. అంతేగాక సచివాలయానికి ఒక డిఎన్‌ఎం నియమిస్తే మంచిదని వ్యక్తిగతంగా అభిప్రాయపడుతున్నా. అలాగే జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 70 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయి. వాటిని త్వరగతిన చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరుతున్నాము. నోటీసులు ఇచ్చాం. చెల్లించని పక్షంలో చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటాం.

ప్ర : రైతులకు, వినియోగదారులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి ?

జ : విద్యుత్ కనెక్షన్ ఉన్న ప్రతి వినియోగదారుడు ప్రతినెల సక్రమంగా విద్యుత్ బిల్లు చెల్లించాలి. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు ఎటువంటి పరిస్థితుల్లోనూ తాకరాదు. ముఖ్యంగా రైతులు తమ విద్యుత్ మోటార్ల ద్వారా సొంతంగా మరమ్మతులకు దిగి ఒక్కొక్కసారి ప్రాణాలు తీసుకుంటున్నారు. సొంతంగా రిపేర్లు చేయడం, స్తంభాలు ఎక్కడం తదితర పనులు చేపట్టరాదు. విద్యుత్ లైన్‌మెన్, హెల్పర్ సహాయం తీసుకోవాలి.



విద్యుత్‌శాఖ జిల్లా నోడల్ అధికారి

వినియోగదారులు కానీ రైతులు కానీ విద్యుత్ ముందు సాహసాలు చేయవద్దని కోరుతున్నాం. హై వోల్టేజీ, లోవోల్టేజీ సరఫరా సమయంలో జాగ్రత్తలు పాటించాలి. సాధ్యమైనంత వరకు విద్యుత్ ను ఆదా చేసుకోవాలి.

రాహుల్‌గాంధీపై కక్ష సాధింపు తగదు

సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి



ప్రజాశక్తి-మడకశిర రూరల్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై మోడీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు పాల్పడడం తగదని సిడబ్ల్యుసి సభ్యులు, మాజీ రాష్ట్ర మంత్రి ఎన్.రఘువీరారెడ్డి ఆదివారం ఒక వీడియో విడుదల చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయించడం, ఇంటిని ఖాళీ చేయించడం, తదితర చర్యలకు పాల్పడిందని మండిపడ్డారు. ప్రజలు, రైతులు, యువతకు మోడీ ప్రభుత్వం చేస్తున్న వంచన గురించి గత శనివారం రాహుల్‌గాంధీ పార్లమెంటులో దేశ ప్రజలందరికీ అర్థమయ్యే విధంగా మాట్లాడితే ఈడీ దాడులు చేయిస్తామని బెదిరిస్తూ సంకేతాలు పంపడం దుర్మార్గమన్నారు. మోడీ ప్రభుత్వ చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. మణిపూర్, కేరళ రాష్ట్రాల్లో విపత్తులు సంభవించడంతో రాహుల్ గాంధీ అక్కడి ప్రజలకు అండగా ఉండి ధైర్యం నింపే కార్యక్రమం చేస్తే, ప్రధానమంత్రి, రక్షణ మంత్రి ఎవరూ ఆ ప్రాంతాలను కూడా సందర్శించకపోవడం శోచనీయమన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు, సిఐటియూ జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు

దళితుల సంక్షేమానికి ప్రభుత్వాలు మోకాలడ్డు

సిఐటియు, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

దళితుల సంక్షేమం కోసం పాటుపడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డు పడడంతో పాటు వారి సంక్షేమం కోసం పాటుపడుతున్న ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థకు వచ్చే నిధులకు సైతం కేంద్రం అడ్డుపడుతోందని సిఐటియు, కెవిపిఎస్ నాయకులు విమర్శించారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం అన్నమయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి.శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దళిత వాడల అభివృద్ధి కోసం వస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి, దళితవాడల అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను ఇవ్వడం లేదన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌డిటి సంస్థ దళితుల అభివృద్ధితో పాటు సేవాభావంతో పని చేస్తున్న ఆర్‌డిటి సంస్థకు విదేశాల నుంచి వస్తున్న నిధులకు కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతూ సంస్థను ఇబ్బంది పెడుతుందన్నారు. దీనిని నిరసిస్తూ సెప్టెంబర్ 5వ తేదీ తహశీల్దార్ కార్యాలయం వద్ద నాటిక ప్రదర్శన నిర్వహిస్తామని, అందులో అంబేద్కర్ వాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, రామాంజనేయులు, వెంకట్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



బత్తలపల్లిలో కేక్ కట్ చేసి ఫ్రెండ్ షిప్ వేడుకలు చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లిలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదివారమైనా కొందరు విద్యార్థులు పాఠశాలలకు వచ్చి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకున్నారు. ఉపాధ్యాయులకు స్వీట్లు పంచారు. స్నేహం చాలా విలువైందని పలువురు కొనియాడారు. పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కేరళ వరద బాధితులకు తమ వంతుగా రూ. 10వేలను కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా పంపి ఉదారత చాటుకున్నారు.



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ధర్మవరం టౌన్ : స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాని విశేష స్పందన లభించింది. శిబిరంలో వైద్యులు 80 మందిని పరీక్షించి 50 మందిని కంటి శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, ఉపాధ్యక్షుడు సుకుమార్, కార్యదర్శి జయరాం తెలిపారు. వైద్యులు కంటి సంరక్షణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సుబ్బారావు, చాంద్‌బాషా, సత్రశాల మల్లికార్జున, రమేష్‌బాబు, రామాంజి, వైకె.శ్రీనివాసులు, బండ్లపల్లి రంనాథ్, పోలా ప్రభాకర్, ఒవి.ప్రసాద్, కోటేశ్వరరావు, పిఆర్‌ఒ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

పుట్టపర్తి క్రైమ్ : డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జిటి రాసే గిరిజన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3 నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. టెట్, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తులు అనంతపురంలోని పెన్నార్ భవన్(గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయం)లో లభిస్తాయన్నారు.

జ్యువెలర్స్ వ్యాపారుల అభివృద్ధికి కృషి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని జ్యువెలర్స్ వ్యాపారుల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని జ్యువెలర్స్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ రెహ్మాన్, కార్యదర్శి కెహెచ్.ప్రకాశ్‌రావు తెలిపారు. స్థానిక పీఆర్టీలోని షాదీమహల్‌లో ఆదివారం జ్యువెలర్స్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఖలీల్ రెహ్మాన్, కెహెచ్.ప్రకాశ్‌రావులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ జ్యువెలర్స్ వ్యాపారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జ్యువెలర్స్ కమిటీ మాజీ అధ్యక్షులు రవూఫ్, సభ్యులు శశాంక్, మురళీ, ఇమ్రాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్యువెలర్స్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ రెహ్మాన్

గొల్లపల్లి తాగునీటి పథకం పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి తాగునీరందించే గొల్లపల్లి తాగునీటి పథకాన్ని ఆదివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, వైసిపి, టిడిపి కౌన్సిలర్లు అధికారులతో కలిసి పరిశీలించారు. తాగునీటి పథకం ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, పంపుసెట్ల మరమ్మతులకు రూ. 1.5 కోట్లతో ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ విషయం గత కౌన్సిల్ సమావేశంలో వివాదాస్పదమైంది. అంత సొమ్మును ఐదేళ్ల క్రితం నిర్మించిన పథకానికి ఎలా ఖర్చు పెడతారని, గుత్తేదారులు నాసిరకం పనులు చేశారని, ఇప్పుడు ఖర్చు చేసే రూ. 1.5 కోట్లు వృథా అవుతాయని వైసిపి కౌన్సిలర్లు ఇటీవల కౌన్సిల్ సమావేశంలో అభ్యంతరం తెలిపారు. గతంలో గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వహణ పట్టించుకోలేదని దీంతో పథకంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే నీటి సరఫరా ఎప్పుడైనా ఆగిపోవచ్చని ఇంజినీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఉమ్మడిగా ఎక్కడెక్కడ అవసరమో ప్రత్యక్షంగా పరిశీలించి, అనంతరం రూ. 1.5 కోట్లకు సంబంధించిన పనులకు ఆమోదం తెలపడానికి కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పర్యటనకు వెళ్లారు. పట్టణానికి నీటిని తీసుకొవచ్చే ఈ తాగునీటి పథకాన్ని సోమందేపల్లి శ్రీకృష్ణదేవరాయనగర్, గొల్లపల్లి ప్రాజెక్ట్ వద్ద ఉన్న పంప్ హౌస్‌లను వాటి మోటార్లను పంపులతో పాటు ప్యానల్ బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఒక చోట ఒకే ట్రాన్స్‌ఫార్మర్ పని చేస్తుందని, మరో చోట ఒక మోటారు పని చేస్తుందని, గొల్లపల్లి వద్ద మూడు మోటార్లు పని చేయాల్సి ఉంటే ఒకే మోటారు పని చేస్తున్నందని, ఈ మోటారు ఆగిపోతే ఏ క్షణంలోనైనా నీటి సరఫరా ఆగిపోయే ప్రమాదం ఉందని గుర్తించారు. వెంటనే మూడు ప్రాంతాలలో మూడు మోటార్లను ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తే పట్టణంలో నీటి సమస్యను పరిష్కరించడానికి సాధ్యమవుతుందని ప్రజాప్రతినిధుల బృందం అభిప్రాయపడింది. అయితే ఉన్న నిధులను అనవసరంగా ఖర్చు చేయకుండా అవసరమైనంత మాత్రమే ఖర్చు పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డిఈ బాలసుబ్రమణ్యం నీటి ప్రాజెక్టు సంబంధించి అన్ని వివరాలను వారికి సమగ్రంగా వివరించారు. తాను బదిలీ అవుతున్నాని, అయినప్పటికి నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా, మూలన పడిన కరువు నిధులను గుర్తించి, సమస్యను జిల్లా కలెక్టర్‌కు సమగ్రంగా వివరించి, నిధులను తీసుకురావడంతో పాటు మూడు ప్రాంతాల్లో మరమ్మతులు చేయించేందుకు ప్రయత్నిస్తున్నానని, ఇందులో తన ప్రయోజనాలు లేవన్నారు. వెంటనే మరమ్మతులు చేయించుకోకపోతే హిందూపురం పట్టణానికి నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధుల బృందంతో కలిసి ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ హిందూపురం పట్టణానికి సరఫరా అవుతున్న గొల్లపల్లి నీటి సరఫరాను ఆదివారం సమగ్రంగా పరిశీలించామన్నారు. మూడు ప్రాంతాల్లో మోటార్లు, పంపులతో పాటు ప్యానల్ బోర్డులు, వికె తండా వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు వెంటనే చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మరో రెండు రోజుల్లో ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి, ఈ అంశాలపై ఆమోదం తెలిపి, పట్టణంలో నీటి సరఫరాను మెరుగు పరుస్తామన్నారు. పరిశీలించిన వారిలో టిడిపి కౌన్సిల్ ప్రతిపక్ష నేత డిఈ రమేష్ కుమార్, కౌన్సిలర్లు, ఎఈ జనార్దన్, ఇతర అధికారులు ఉన్నారు.



పంపింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు

తూతూ మంత్రంగా మండల సమావేశం

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధులు అసహనం

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం జడ్పిటిసి పద్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగిందని చెప్పవచ్చు. అధికారులు చాలా మంది గైర్హాజరవగా సర్పంచులు, ఎంపీటీసీలు కూడా ఆశించిన స్థాయిలో హాజరు కాకపోవడంతో గంట 30 నిమిషాల్లోపే ముగించారు. ముందుగా ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. వ్యవసాయ అధికారి నివేదిత ఆ శాఖలో జరిగిన అభివృద్ధి, జరగబోయే కార్యక్రమాలను వివరించారు. హౌసింగ్, ఐసిడిఎస్, వైద్యాధికారులు వారి శాఖల గురించి మాట్లాడారు. ఉపాధిహామీ అధికారులు మాట్లాడుతుండగా కొందరు సర్పంచులు వారి పంచాయతీల్లో జరగాల్సిన ఉపాధి పనుల గురించి వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ కళాశాల వేళలకు అనుగుణంగా బస్సు లేకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మడకశిర నుంచి వెంకటాపురం మీదుగా రొద్దం కు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఇక రవాణా, పోలీస్, విద్యుత్, ఫారెస్ట్, రెవెన్యూ శాఖ నుంచి ఎవరూ హాజరుకాక పోవడం గమనార్హం. కొన్ని శాఖల నుంచి మండల అధికారులు కాకుండా కింది స్థాయి ఉద్యోగులు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యలకు సమాధానం చెప్పే వారు లేకపోవడంతో సర్పంచులు, ఎంపీటీసీలు అసహనం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వెళ్లిపోయారు. జడ్పిటిసి పద్మ మాట్లాడుతూ గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఒను కోరారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం 12:30 గంటలకి ముగిసింది. ఇదిలా ఉండగా వెలుగు కార్యాలయంలో సిఎం చంద్రబాబు చిత్రపటాన్ని గోడకు తగిలించ కుండా టేబుల్‌పై పెట్టడంతో టిడిపి సర్పంచి మంజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎపిఎం మాట్లాడేటప్పుడు టేబుల్‌పై ఉన్న ఫొటోను చూపిస్తూ సర్పంచి నిలదీశారు. సమావేశంలో ఎంపిపీ చంద్రశేఖర్, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వైభవంగా శ్రీచౌడేశ్వరీదేవి జాతర

ప్రజాశక్తి-సోమందేపల్లి

తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం, గ్రామదేవతగా పూజలందుకుంటున్న శ్రీచౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు ఆదివారం వేలాది మంది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ సమితి అధ్యక్షులు డిసి ఈశ్వరయ్య దంపతులు, తొగటవీర క్షత్రియ అధ్యక్షులు సిసి హరి, జ్యోతి, కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని పెద్దమ్మ గుడి వద్ద నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి దర్శించుకొన్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను ఆలయ కమిటీ అధ్యక్షులు ఈశ్వరయ్య దంపతులు, సిసి హరి తదితరులు కట్ చేసి అమ్మవారికి తినిపించారు. ఎస్ఐ విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, మాజీ ఎంపీపీ వెంకటేశులు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు డివి ఆంజనేయులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సిసి హరి ఉచితంగా కుండలు పంపిణీ చేయగా మహిళలు పూలతో ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో డిసి నారాయణస్వామి, డిసి మంజు నాథ్, డిసి లోకేష్, గట్టా మహీంద్ర, రంగన గోపాల్, చింతా రామాంజనేయులు, నాగేంద్ర, పూజారి ఈశ్వరయ్య, ప్రసాద్, సోమశేఖర్, జ్యోతి సంఘం సభ్యులు బండారు ఆంజనేయులు, రంగన ప్రసాద్, దాసరి మారుతి, బండారు శ్రీనివాసులు, మామిళ్ల శ్రీనివాసులు, బీరే కేశవయ్య, కేతా రుశేశ్వర్, అశ్వర్థనారాయణ, మంచాల హనుమంతు, మామిళ్ల రామాంజనేయులు, మామిళ్ల పురుషోత్తం, దాసరి ప్రకాష్, దాసరి లోకేష్, కాచర్ల రాము, మాయకుంట్ల మంజు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీచౌడేశ్వరీదేవికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

శ్రీచౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

కదిరి అర్బన్ : పట్టణంలోని మదనపల్లి రోడ్డు సమీపంలో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు సురేంద్ర స్వామి ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, ఉయ్యాల సేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు రమేష్, అర్చకులు శేషాద్రి పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఆషాడం ముగింపు రోజు ఆదివారం పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన మహిళలు చౌడేశ్వరిదేవి కట్ట నుంచి బోనాలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా దుర్గమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. ఆలయాల ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బాలెం ఓబుళేశు, గంగాధర్, చంద్ర పాల్గొన్నారు.

10న యుటిఎఫ్ జిల్లాస్థాయి టీచర్స్ చెస్ టోర్నీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో ఈ నెల 10వ తేదీ జిల్లా స్థాయి టీచర్స్ చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సంబరాల జిల్లా స్థాయి టీచర్స్ చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ కన్వీనర్‌గా రామకృష్ణనాయక్, శివకృష్ణ వ్యవహరిస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా పట్టణ, మండలాల నుంచి జట్లు పాల్గొంటాయన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే సొంత చెస్ కిట్టుతో హాజరు కావాలన్నారు. ముందస్తుగానే యుటిఎఫ్ నాయకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ధర్మవరం జోన్ యుటిఎఫ్ నాయకులు జయసింహ, హనుమంతరావు, ఆంజనేయులు, లక్ష్మయ్య, సకల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హోరాహోరీగా యుటిఎఫ్ టీచర్స్ క్రికెట్ పోటీలు

పెనుకొండ : యుటిఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా పట్టణంలో జిల్లా శాఖ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ పోటీలు హోరాహోరగా సాగుతున్నాయి. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టోర్నీ కన్వీనర్ జిసి.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో 2 మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్ పుట్టపర్తి, రొద్దం జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన పుట్టపర్తి జట్టు నిర్ణీత 12 ఓవర్స్‌లో 83 పరుగులు చేసింది. రొద్దం జట్టు 8 ఓవర్స్‌లో 2 వికెట్స్ కోల్పోయి గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా గంగాధర్ నిలిచారు. మధ్యాహ్నం రెండో మ్యాచ్ ఎన్‌పి కుంట, మడకశిర జట్ల మధ్య జరిగింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మడకశిర జట్టు 12 ఓవర్స్‌లో 79 పరుగులు చేసింది. ఎన్‌పి కుంట జట్టు 3 వికెట్స్ కోల్పోయి గెలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా యోగి నిలిచారు. కార్యక్రమంలో యుటిఎఫ్ డివిజన్ నాయకులు గంగాధర్, శివయ్య, ఆది, జినేష్, మారుతి, శేషాద్రి, నరేష్‌బాబు, కాశీ, వంశీ, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి



కరాటేలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎం, కరాటే మాస్టర్లు

కరాటేతో ఆత్మరక్షణ

ధర్మవరం టౌన్ : కరాటేతో ఆత్మరక్షణ ఉంటుందని కరాటే అకాడమీ మాస్టర్లు నాగరాజు, రమేష్ తెలిపారు. పట్టణంలోని బిఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హెచ్‌ఎం రామ్‌ప్రసాద్, మాజీ కౌన్సిలర్ బీరే ఎర్రిస్వామి, బైముతక రమణ హాజరై కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

కరాటేలో మెరిసిన 'పురం' విద్యార్థులు

హిందూపురం : బెంగళూరులో ఆదివారం జరిగిన కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కరాటే మాస్టర్ రఫిక్‌అహ్మద్ తెలిపారు. పోటీల్లో పట్టణంలోని ఎల్ఆర్‌జి విద్యాలయ, ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్, చిన్మయ, లోటస్ పబ్లిక్ స్కూల్, శాసనకోట జడ్పీ హైస్కూల్ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటి 42 మెడల్స్ సాధించారన్నారు. పోటీల్లో కరాటే మాస్టర్లు జనార్ధన్‌రెడ్డి, రియాజ్ బాషా, కరాటే విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.



విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

నేరాలు ఘోరాలు

రైలుకిందపడి యువకుడి ఆత్మహత్య



మాదాపురం మహేశ్(ఫైల్‌ఫొటో)

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తారకరామాపురం కాలనీకి చెందిన క్రిష్ణమూర్తి కుమారుడు మాదాపురం మహేశ్(24) శనివారం రాత్రి గుట్టకిందపల్లి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. మహేశ్ తండ్రి 7 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో మహేశ్, తల్లి రాజేశ్వరి ఇద్దరూ కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవారు. అయితే మద్యానికి బానిసైన మహేశ్ పనులకు వెళ్లకుండా ఉండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి వివాహం కాలేదు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

విద్యుత్ తీగలు తెగి పడి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక దొరిగల్లు రోడ్డులో ఆదివారం 11 కెవి విద్యుత్ లైన్ తెగపడిన సంఘటనలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వివరాలు.. మధ్యాహ్నం దొరిగల్లు రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న 11 కెవి లైన్‌పైకి కోతులు ఎగరడంతో విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి రాజుకుని భారీ శబ్దంతో మంటలు రేగాయి. దీంతో పట్టణంలో మూడు చోట్ల ఎక్కడికక్కడే వైర్లు తెగిపడ్డాయి. అక్కడి నుంచి పంచాయతీ కార్యాలయం మీదుగా విద్యుత్ కార్యాలయం వరకూ వైర్లు ఎక్కడికక్కడే కాలిపోయి రోడ్లపై పడ్డాయి. విద్యుత్ తీగలు పంచాయతీ కార్యాలయం ఎదుట చిరు వ్యాపారాలు చేసుకుంటున్న గుడ్డంపల్లితండాకు చెందిన తులసమ్మ, కట్టకిందపల్లికి చెందిన సాకే లక్ష్మీనారాయణమ్మలపై పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరగడంతో తక్షణమే సిఐ యతేంద్ర, పోలీసు సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన మహిళలను ఆసుపత్రికి తరలించారు. అలాగే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. విషయం తెలిసిన వెంటనే టిడిపి నాయకులు మనోహర్, సూరి, సిపిఐ నాయకులు చల్లా శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత మహిళలను పరామర్శించారు.

మానవ సేవకు ప్రతిరూపం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మానవ సేవకు ప్రతిరూపం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అని జిల్లా వైస్ ఛైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని కేశవనగర్‌లో ఉన్న మెహర్ వైట్ హౌస్‌లో ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, యువర్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య నిపుణులు రవి ప్రకాష్, సుభాష్ చంద్రబోస్ రోగులకు వైద్య సేవలందించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 60 మంది రోగులకు అల్పాహారం కూడా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి గుద్దిటి సోమదాసు, వైద్య నిపుణులు రవి ప్రకాష్, సుభాష్ చంద్రబోస్‌లను సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి విశ్వనాథ్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరామ్, కోశాధికారి బండి నాగేంద్ర, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు, క్యాంపు ఛైర్మన్ డాక్టర్ సత్య నిర్ధారన్, చాంద్‌బాషా, సికె.రామాంజనేయులు, వంకదారి మోహన్, గర్రె రమేష్ బాబు, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

కదిరి టౌన్ : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం ఆయన అభిమానులు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఆమర కార్యాలయంలో డాక్టర్ పివి.సిద్ధారెడ్డి, పి.చిన్న గంగిరెడ్డి చేత కేక్ కట్ చేయించారు. అనంతరం అనాథ పిల్లలకు అన్నదానం, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రధాన రహదారిపై వ్యర్థాలు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

కదిరిటౌన్ : పట్టణంలోని ప్రధాన రహదారిపై వేసిన డ్రెయినేజీ వ్యర్థాలను మున్సిపల్ అధికారు లు ఎట్టకేలకు తొలగించారు. ఆదివారం ప్రజాశక్తిలో 'రోడ్డుపైనే డ్రెయినేజీ వ్యర్థాలు' శీర్షికన ప్రచురిత మైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు రోడ్డుపై రాకపోకలకు అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో శ్రమదానం

చిలమత్తూరు : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్షా అకాడమీ విద్యార్థులు, సిబ్బంది ఆదివారం శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. కల్నల్ కిరీట్‌నాయర్ మాట్లాడుతూ నెలకోసారి శ్రమదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ శ్రమదానం అలవర్చుకోవాలని, తద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కమాండెంట్ నవీన్‌త్యాగి, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌకదుకాణాలు ప్రారంభం

అమరాపురం : మండలంలోని వీరాపురం గ్రామంలో డీలర్ రమేష్ బాబు చౌక దుకాణాన్ని ఆదివారం ప్రారంభించారు. టిడిపి మండల కన్వీనర్ గణేష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమం లో మాజీ జడ్పీటిసి నరసింహమూర్తి, నాయకులు జయకుమార్, బి.చెన్నప్ప, సిద్ధేశ్వర, దేవరాజు, శివన్న, జోగప్ప, నాగరాజు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు

మడకశిర రూరల్ : మండలంలోని కొండంపల్లి గ్రామంలో ఆదివారం చౌకదుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచి భీమప్ప, కరియన్న, రమేష్, హనుమంతరాయప్ప, రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే కర్తవ్యంగా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ఆదివారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. అలాగే సాయంత్రం విజిబుల్ పోలింగ్ నిర్వహించి రోడ్లపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రేరేపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



విజేత జట్టుకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

అట్టహాసంగా క్రికెట్ పోటీలు

కదిరి టౌన్ : పట్టణంలో ఆదివారం మండల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఉదయం జరిగిన పోటీలో వెటరన్స్ పోటీలో థండర్స్ జట్టు 133 పరుగులు చేసింది. ఫైటర్స్ జట్టులో ఆది(44), రాము(36), ఎల్లప్ప(25) పరుగులతో రాణించడంతో విజయం సాధించింది. మరో పోటీలో అండర్-14 జట్టు 90 పరుగులు చేయగా అండర్-16 జట్టు కేవలం ఒక వికెట్ కోల్పోయి విజయం సాధించింది. తరుణ్ 35 పరుగులు చేశాడు. గోవర్ధన్ 5, ఫర్హాన్ 2 వికెట్లు సాధించారు. రాణించిన క్రీడాకారులకు కదిరి మండల క్రికెట్ సంఘం సభ్యులు మెడల్స్ బహుకరించారు. ఈ పోటీల్లో 40 మంది వెటరన్, అండర్-16, అండర్-14 క్రీడాకారులు పాల్గొన్నారు.